# మట్టి మనిషి

ఎర్రటి దుమ్మును లేపుకుంటూ వచ్చిన జీపు చుట్టూ మూగారు ఆ ఊరి రైతాంగం. జీప్‌లోంచి డిప్టీ కలెక్టర్, నా తోటి ఉద్యోగి ఖాన్, ఇంకా మిగిలిన సిబ్బంది అంతా దిగాం.

ఊరికి దిగువ అయిదు కిలోమీటర్ల దూరంలో నిర్మాణం పూర్తికానున్న ప్రాజెక్ట్ రిజర్వాయరులో మునిగిపోయే పది పల్లెలలో ఆ ఊరు కూడా వుంది. రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించడానికి ఆ ఊరెళ్ళాం. గ్రామ సర్పంచ్ సమక్షంలో రైతులను పిలిచి చెక్కులను పంచడం మొదలెట్టారు డిప్యూటీ కలెక్టర్.

ఒక్కొక్కరి పేరు నేను చదువుతుంటే ఖాన్ చెక్కు నంబర్లు చూసి రైతులకు డిప్యూటీ కలెక్టర్ అందివ్వడంలో సహాయపడుతున్నాడు. మధ్యలో సర్పంచ్ గారింటి వద్ద నుంచి వచ్చిన పెసరట్లూ, టీలు తీసుకున్నాం. చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తయ్యేసరికి ఒంటిగంట అయింది. డిప్యూటీ కలెక్టరూ, సిబ్బందీ సర్పంచ్‌గారింట్లో భోజనానికి బయల్దేరారు. నేను లక్ష్మయ్యతో కలిసి లక్ష్మయ్య చేను వైపు దారి తీశాను.

"రామిరెడ్డీ నువ్వు జల్దీ రావాలె" అంటూ నన్ను హెచ్చరించి సిబ్బందితో కలిసి సర్పంచ్ ఇంటివైపు కదిలాడు డిప్యూటీ కలెక్టర్.

"ఏం లక్ష్మయ్యా, ఈ డబ్బుతో ఏం చేద్దామనుకుంటున్నావు. వ్యాపారం చేద్దామనా లేక మళ్ళీ భూములేమన్నా కొంటావా?" చెక్కును పంచెలో ముడివేసి కట్టి బొడ్లో దోపుకుంటున్న లక్ష్మయ్య నడిగాను.

"ఇంకా ఏటీ అనుకోలేదయ్యా" అంటూ ముందు నడుస్తున్న లక్ష్మయ్య మాటల్లో మునుపటి ఉత్సాహం లేదు. చెక్కును పంచేటప్పుడే లక్ష్మయ్య మొఖంలో విచారాన్ని పసికట్టాను. లక్ష్మయ్యతో నా పరిచయానికి వయస్సు ఆర్నెల్లు. ప్రాజెక్టు భూసేకరణ డిప్యూటీ తాసిల్దారుగా చేరిన పది రోజులకే పరిచయమయ్యాడు. ఓ రోజు ఎండనబడి భూములను తనిఖీ చేస్తూ లక్ష్మయ్య చేను మకాం వద్ద మంచినీళ్ళ కోసం ఆగినప్పటి నుంచీ లక్ష్మయ్య పరిచయం. ఆ పరిచయం తరువాత ఎప్పుడు ఆ ఊరొచ్చినా లక్ష్మయ్య ఆతిథ్యం స్వీకరించిగాని వెళ్ళే వాణ్ణి కాదు. హైదరాబాదులో పుట్టి పెరిగిన నాకు లక్ష్మయ్యతో దోస్తీకలగడం మా ఆఫీసులో అందరికీ ఆశ్చర్యమే. అరవై దాటిన వయస్సులో చొక్కా నేను కోకుండా ఎండనబడి కష్టిస్తుంటే నాకు లక్ష్మయ్యలో సిసలైన రైతు కనిపించేవాడు. తెలంగాణా సాయుధ పోరాట కథల్లోని రైతుకు ప్రతిబింబంగా అనిపించేవాడు. అతని నల్లటి ఉక్కు శరీరం ఎండా వానా నమ్మెట దెబ్బలకు రాటు దేలింది. చెమట పడితే మంచు బిందువు లతో మెరుస్తున్నట్టుండేది లక్ష్మయ్య శరీరం. లక్ష్మయ్య మూడెకరాల చిన్న రైతు. పెద్ద కొడుకు సైన్యంలో వున్నాడు. కూతురికి వివాహం చేశాడు. చిన్న కొడుకు వ్యవసాయంలో తోడుగా వున్నాడు.

లక్ష్మయ్య చేను మకాం వద్దకు చేరుకునేసరికి లక్ష్మయ్య చిన్న కొడుకు మా కోసం ఎదురుచూస్తున్నాడు. ఎండనబడి నడచి వెళ్ళానేమో చెట్ల నీడకు చేరుకొనేసరికి చల్లదనం శరీరాన్ని మెల్లగా స్పృశించింది. అక్కడే వున్న నులక మంచం మీద కూర్చోగానే కొబ్బరి బొండాం కొట్టి చేతికిచ్చాడు లక్ష్మయ్య చిన్న కొడుకు. తాగాక, ఇంకొకటిస్తే వద్దని వారించాను.

"మళ్ళీ రారు కదా బాబూ. వచ్చినా ఈ చెట్లకాడికి రారు. తాగు బాబూ, ఇలాంటి బొండాలు ఎక్కడోగానీ దొరకవు" అంటూ లక్ష్మయ్య బలవంతపెట్టాడు.

లక్ష్మయ్య విచారం ఇప్పుడర్థమయింది. పది రోజుల్లో ఈ ఊరు ఖాళీ చెయ్యాలి. అందుకే లక్ష్మయ్య అలా వున్నాడని ఊహించాను. ఆకుల్లో భోజనాలు వడ్డించారు. ముగ్గురమూ భోజనానికి కూర్చున్నాం.

ముద్ద కలుపుకుంటూనే కారం తట్టుకోలేక ఒక గ్లాసు మంచినీళ్ళు తాగాను. అది గమనించిన లక్ష్మయ్య "రామిరెడ్డి బాబు ఆఖరిసారిగా భోజనానికి వస్తాడు కాస్త నగ్ర (కారం) తక్కువేసి వండమని చెప్పాను. అలవాటు పడ్డ చెయ్యికదా - మామూలుగా వేసేసింది మా ఆడది" సంజాయిషీ చెబుతున్నట్టుగా వున్నాయి లక్ష్మయ్య మాటలు.

లక్ష్మయ్య ఆప్యాయత ముందు ఆ కారం నన్నేమీ నొప్పించలేదు. నునక నిండిన చూపుతో లక్ష్మయ్యను చూశాను. అతను అన్నం తినే పద్ధతే వేరు. పెద్ద పెద్ద ముద్దలను నోట్లో పెట్టే తీరు, అన్నాన్ని అతి పవిత్రంగా చూసే అతని అలవాటు నాకు ముచ్చటగొలిపేది. లక్ష్మయ్యకు మజ్జిగన్నంలో కూడా రెండు ఉల్లిపాయలూ, నాలుగు పచ్చిమిర్చీ వుండాల్సిందే. అవి చూసినపుడల్లా చైనీస్ రెస్టారెంట్లలోని చిల్లీ సాస్ అవీ గుర్తుకొచ్చేవి. లక్ష్మయ్య చేను మకాంలో వున్న నులక మంచం చూస్తే పెద్ద పెద్ద హోటల్స్‌లో నులకతో చేసిన కుర్చీలు గుర్తుకొస్తాయి. పల్లెటూర్లలో వుండే వాతావరణాన్ని డిమ్ లైట్లతో కృత్రిమంగా అమర్చే నక్షత్రాల హోటల్స్‌లో డబ్బెట్టి కొనుక్కునే నగర జీవితానికీ, ఈ పల్లెలో స్వచ్ఛమైన గాలిలో ఈ చెట్ల నీడలో పొందే ఆనందానికీ ఎంత తేడా! చుట్టూ కొండలు, కొండల మధ్య పొలాలు ఈ ప్రకృతి అందాల ముందు కృత్రిమ నగిషీల జిలుగులు ఏపాటి? అందుకే నాకు లక్ష్మయ్య చేను మకాంలో కొంచెంసేపు గడిపితే పొందే ఆనందం కొలవలేనిది.



"ఏం రామిరెడ్డి బాబూ ఉలుకూ, పలుకూ లేకుండా వున్నావ్" లక్ష్మయ్య హెచ్చరికతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఏం లేదు" అంటూ భోజనం ముగించి నులక మంచంపై నడుము వాల్చాను.

"బాబూ! ఈ నెలాఖరుకి మేము ఈ ఊరు ఖాళీ చెయ్యాలట - నిజమేనా బాబూ" లక్ష్మయ్య ప్రశ్న కొత్తది కాదు. నేను వచ్చినప్పటి నుంచీ ఎన్నోసార్లడిగిన ప్రశ్న. అసలు ప్రాజెక్టు ఏనాడో పూర్తికావలసి వుంది. అనుకున్న ప్రకారం పూర్తయితే పది సంవత్సరాల క్రితమే ఆ ఊళ్ళన్నీ రిజర్వాయర్‌లో మునిగి వుండేవి.

"ఈ ఊరొదిలి వెళ్ళడానికి ఎందుకు బాధపడతావ్. గవర్నమెంటు నీకు డబ్బిచ్చింది కదా! నీ ఒక్కడి చేనే పోవడం లేదు, ఊళ్ళో అందరివీ పోతున్నాయి కదా! ఆ డబ్బు బేంకులో వేసుకుంటే వడ్డీతో బతికెయ్య వచ్చు. లేకపోతే వేరే చోట భూమి కొనుక్కోవచ్చు! దీనికి ఇంత బాధపడడం దేనికి?" అన్నాను చెట్ల ఆకుల

సందుల్లోంచి కొద్దిగా కనిపిస్తున్న ఆకాశానికేసి చూస్తూ.

"కన్నబిడ్డను వేరేవాళ్ళకి అమ్మేసి మళ్ళీ ఇంకో బిడ్డను కొనుక్కోమంటే మీరేం చేస్తారు రామిరెడ్డి బాబూ! ఈ భూమి నాకు అన్నం పెట్టిన తల్లి. నేను సాకి పెంచుకున్న నా శ్రమల పంట. నా చెమటతోటి ఈ భూమిని సాగు చేశాను. ఈ భూమిని నేను ఎట్లా సంపాదించానో తెలిస్తే నేను పడే బాధను అర్థం తెలుస్తుంది బాబూ. ఈ భూమిని గవర్నమెంటువాళ్ళు సర్వేచేసి పట్టా ఇచ్చేనాటికి నాకు



— మారిశెట్టి జితేంద్ర

పదేళ్ళుంటాయి.

అప్పటికి ఇదంతా అడవి. మా అమ్మ, అయ్య కలిసి మొద్దూ మోడూ తీసి సాగులోకి తెచ్చారు. అప్పుడే సర్వే చేయడానికి ఆఫీసర్లు మా ఊరొచ్చారు. వాళ్ళు మా ఊర్లో సంవత్సరంపాటు మకాం వున్నారు. మా అమ్మ పెంచిన ప్రతి కోడిపెట్టలూ వాళ్ళకు వండి పెట్టాం. నీడినీళ్ళు కాయడానికీ, ఒళ్ళు పట్టడానికీ నన్ను మా అమ్మా, అయ్యా వాళ్ళ వద్ద పెట్టారు. పొలం నా సొంతముగాని వాళ్ళకు చాకిరీ చెయ్యను గొడవ పెడితే మావాళ్ళు బుజ్జగించి పంపేవాళ్ళు.

'మనం దున్నుకునే కొండకు పట్టాకావాలంటే వాళ్ళకు సొమ్ము ముట్టచెప్పాలి లేక పోతే పట్టా ఇవ్వరు. ఆళ్ళకు డబ్బెలాగూ ఇవ్వలేం. మనం ఇచ్చుకోగలిగేది మన కష్టం ఒక్కటే,' అని నచ్చచెప్పి వాళ్ళ వద్దకు పంపేవాళ్ళు. అలా సంవత్సరం పాటు చాకిరీ చేస్తే మా భూమికి పట్టా ఇచ్చారు వాళ్ళు. డబ్బిచ్చి వేరే చోట నేను కొనుక్కోగలను గాని ఇలాంటి నేల నేను పొందగలనా రామిరెడ్డి బాబూ."

ఇన్నాళ్ళూ లక్ష్మయ్యలో పైకి కనిపిస్తున్న రైతునే చూశాను. అతని అంతరంగంలోని రైతును ఈ రోజే చూశాను. రైతుకూ భూమికీ వున్న అనుబంధం ఎలాంటిదో లక్ష్మయ్య ప్రత్యక్ష సాక్షిగా కనిపిస్తున్నాడు. అతడి ముడతలు పడ్డ నుదుటి రేఖలు నాగటి చాళ్ళుగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల వేలాది ఎకరాలు సాగులోనికి వస్తాయని, మీరు ఇచ్చే భూమికి వంద రెట్లు భూమి సాగులోనికి వస్తుందని, దేశానికి ఎంతో మేలని చెప్పాలనుకున్నాను. కానీ చెప్పలేక పోయాను. లక్ష్మయ్య పలికిన మాటలు నిజమే. డబ్బిస్తామని చెపితే ఏ తల్లైనా తన బిడ్డను అమ్ముకోగలదా? లేదు! లక్ష్మయ్యకు ఎలా సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా వుండి పోయాను. అదే సమయానికి డిప్యూటీ కలెక్టర్ జీప్‌లో నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. లక్ష్మయ్య వద్ద, అతని చిన్న కొడుకు వద్ద సెలవు తీసుకుని జీప్‌లో కూర్చున్నాను. జీప్ కదిలింది.

"ఏమిటి రామిరెడ్డీ ఈ పిచ్చివాడితో నీకు స్నేహం ఎలా కుదిరింది! అందరూ భూమికి డబ్బెక్కువచ్చేలా ఆఫీసు చుట్టూ పదిసార్లు తిరిగితే వీడు ఈ ఊరు వదలనని అంటాడు. ఒకసారి కలెక్టరూ, నేనూ వస్తే కలెక్టరుతోటీ అదే మాట అన్నాడు..." డిప్యూటీ కలెక్టరు చెప్పుకు పోతున్నాడు." ఆ మాటలేవీ వినబడనట్లు నటించాను. వచ్చే నెలలో రిటైరు కాబోతున్నాడు. ఈ రైతుల పుణ్యమా అని కూతురి పెళ్ళిచేశాడు. పార బాటున భార్య ఆఫీసుకు పని మీద వస్తే ఆమె వద్ద కూడా లంచం పుచ్చుకునే డిప్యూటీకలెక్టరు లక్ష్మయ్యను కించపరుస్తూ మాట్లాడ్డం భరించలేక పోయాను. టాపిక్ మార్చేందుకు ప్రయత్నించాను. లక్ష్మయ్యను కలవాలి మళ్ళీ-'అవసరమయితే ఓ రోజు సెలవు పెట్టి అయినా సరే' అని నిర్ణయించుకున్నాను.

సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి బాబుకు సీరియస్ అని హైదరాబాద్ నుంచి టెలిగ్రామ్. హైదరాబాదు వెళ్ళి అక్కడ నుంచే పది రోజులపాటు సెలవు పొడిగించాను. ఇంకో నెల రోజులకు నా ట్రైనింగ్ పూర్తయి హైదరాబాదు వచ్చేస్తానని శ్రీమతికి ధైర్యం చెప్పి తిరిగి ప్రయాణమయ్యాను. ఆఫీసుకు వచ్చీ రాగానే కలెక్టరు వద్ద నుంచి పిలుపు. కలెక్టరు ఆఫీసుకు వెళ్ళే సరికి ప్రాజెక్టు ఇంజనీర్లూ డిప్యూటీ కలెక్టరూ, కలెక్టరు వద్ద సమావేశంలో వున్నారు. లోనికివెళ్ళి కలెక్టర్‌కు విష్‌చేసి సీట్లో కూర్చున్నాను.

"మిస్టర్ రామిరెడ్డీ 'జంపెల్ల' గ్రామాన్ని ఖాళీ చేయించడానికి నిన్న వెళ్ళిన ఇంజనీర్లకు ఆ గ్రామంలో లక్ష్మయ్య అనే రైతు ఖాళీ చేయనని చెప్పి గొడవ చేశాడట. దాంతో మిగిలిన రైతులలో కొంత మంది మేమూ ఖాళీ చేయమని చెప్తున్నారట. ఆ రైతు నీకు

తెలుసట కదా! అతనికేమైనా మతి చలించిందా!"

"నో సర్ అతను మామూలుగానే వున్నాడు. నేను చెప్పి ఒప్పిస్తాను సర్"

"ఓ.కె. ఎస్.పి.కి ఫోన్ చేశాను కొంత పోలీస్ ఫోర్స్ కూడా పంపమని! మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ రేపు సాయంత్రానికల్లా ఆ ఊరు మొత్తం ఖాళీ చేయించాలి. మెయిన్ గేట్లు మూసి వేసినందువల్ల వర్షాలు పడితే రిజర్వాయర్‌లో మునిగి ఎవరైనా చనిపోతే మనమే దానికి బాధ్యులమవుతాం. నన్ను వైర్‌లెస్‌లో కాంటాక్ట్ చేసి ఏ విషయమూ రేపు మధ్యాహ్నానికి చెప్పండి" అందరి నీ ఉద్దేశించి చెప్పారు కలెక్టర్.

** ** **

ఉదయం ఆరు గంటలకల్లా నాలుగు జీప్‌లలో పోలీసులతో కలిసి బయల్దేరాం. ఎనిమిది అయింది ఊరు చేరుకునే సరికి. ఊరు సగానికి పైగా ఖాళీచేశారు. జీపును నేరుగా లక్ష్మయ్య ఇంటివైపు తీసుకెళ్ళమని డ్రైవర్‌తో చెప్పాను. ఇంటి దగ్గరవరకు జీప్ వెళ్ళే మార్గం లేక జీపును కొంచెం దూరంలోనే ఆపి లక్ష్మయ్య ఇంటి వైపు చక చకా సాగిపోయాం. లక్ష్మయ్య ఇంటి ముందు గుంపులు గుంపులుగా జనం. పెద్దగా స్త్రీ ఏడుపు వినిపిస్తోంది. జనాన్ని తోసుకుని కాస్త ముందుకు వెళ్ళి చూస్తే లక్ష్మయ్య చిన్న కొడుకు పెద్దగా ఏడుస్తూ నన్ను చుట్టేశాడు. గుమ్మంలో లక్ష్మయ్య భౌతిక కాయం వద్ద కూర్చుని తలను చేత్తో బాదుకుంటూ రోదిస్తున్న ఆమెను వారించడానికి పక్కనున్న స్త్రీలు ప్రయత్నిస్తున్నారు. లక్ష్మయ్య చిన్న కొడుకుని వారించి, బయటకువచ్చి ఇంజనీర్లతోను, పోలీసులతోనూ చర్చించాను. రెండు రోజులపాటు ఊరును ఖాళీ చేయించే పని ఆపాలని కలెక్టర్‌కు తెలియపరచమని వాళ్ళతో చెప్పి నేను, అక్కడే వుండి పోయాను. మధ్యాహ్నం అయ్యేసరికి దగ్గరలోనే వున్న కూతురు, అల్లుడూ వచ్చారు. ఎక్కడో కాశ్మీర్‌లో వున్న పెద్ద కొడుకు రావాలంటే మూడు రోజులు పడుతుంది. అందువల్ల శవ సంస్కారం చేసెయ్యాలని నిర్ణయం తీసుకున్నారక్కడ పెద్దలంతా.




ఏమో! ఏ ప్లాట్ ఫాంమీద కొస్తోందో ఎవడికితెలుసు! గీరగా మాట్లాడినంత మాత్రాన రైల్వే ఎంప్లాయీనని ఎవడనుకోమన్నాడు !

సాయంత్రం నాలుగు గంటల వేళ లక్ష్మయ్య చేను వద్దనే దహన సంస్కారం చెయ్యడానికి ఏర్పాట్లు చేశారు. ఊరేగింపుగా శవం కదుల్తోంది.

"ఉక్కులాంటి మనిషి! ఏనాడూ కాస్త నలత చేసినట్టుగా చూడలేదు. అంతెందుకండీ పొద్దునే లేచి పొలం వెళ్ళి పాలు పితుక్కొచ్చాడు." ఓ రైతు లక్ష్మయ్య గురించి చెప్పుకు పోతున్నాడు.

లక్ష్మయ్య చావుకు కారణం నాకు తెలుసు. లక్ష్మయ్యకు తెలుసు. కాని లోకానికేం తెలుసు. శవానికి లక్ష్మయ్య చిన్న కొడుకే నిప్పంటించాడు. సూర్యుడు పడమటి దిక్కుగా కొండల చాటుకు వెళ్ళి పోతుండగా శవం కాలి బూడిద అయ్యింది. అంతా అక్కడికో ఫర్లాంగు దూరంలో పారుతున్న ఏటిలోనికి స్నానాలకు వెళ్ళారు. ఆకాశం మబ్బులతో దట్టంగా మారింది. సన్నగా చినుకులు మొదలయ్యాయి. మామిడి చెట్ల వైపు నడిచాను. స్నానానికి వెళ్ళిన వాళ్ళు అక్కడకు కనిపిస్తూనే వున్నారు.

వర్షం కాస్త ఎక్కువ కావడంతో వెళ్ళి పాకలో కూర్చున్నాను. పాకలో వున్న గేదెలు, ఎడ్లు నన్ను చూసి లేచి నిల్చున్నాయి. బహుశా పొద్దుట లక్ష్మయ్య వేసిన మేతే నేమో వాటి ముందు ఒక్క గడ్డి పరక కూడా లేదు. ఆ పాకలో కూర్చుని గతంలోని కెళ్ళి పోయాను. లక్ష్మయ్యతో అక్కడ అప్పుడప్పుడూ గడిపిన క్షణాలు గుర్తుకొస్తున్నాయి. చొక్కా లేకుండా వున్న లక్ష్మయ్యను చూసి నువ్వు చొక్కా ఎందుకు వేసుకోవు అంటే "నాకెందుకు బాబూ మట్టిలో పొర్లే వాణ్ణి" అనే వాడు. తను పెరిగిన మట్టిలోనే కలిసిపోయాడు. అరగంటకు వాగు వద్దకు స్నానానికి వెళ్ళినవాళ్ళు వచ్చారు. వర్షంతో పాటు నా ఆలోచనలూ ఆగిపోయాయి. ఓ రైతు నావద్దకు వచ్చి "పదండి తాసిల్దారుగారూ అంతా అయిపోయింది" అంటూ ముందుకు సాగి ముందుగా నడుస్తున్న వాళ్ళలో కలిసిపోయాడు. రోడ్డు ఎక్కబోతూ చేనుకు అడ్డంబడి నడుస్తున్న నాకు గుప్పున వాసన కొట్టింది. ఆగి చుట్టూ చూశాను. అదో రకమైన వింత వాసన. ఎండకు కాలిన నేలమీద వర్షం పడినందువల్లే వచ్చే పరిమళం. లక్ష్మయ్యను ఎన్నిసార్లడిగాను మట్టి వాసన ఎలా వుంటుందని. రష్యన్ అనువాద కథల్లో చదివాను మట్టివాసన గూర్చి. "బాగా కాగిన నేల మీద చినుకులు పడితే అపుడొస్తుంది మట్టి వాసన. మీకు చూపిస్తానుండండి" అంటుండేవాడు. నా చుట్టూ మట్టి వాసన. అక్కడే అయిదు నిమిషాల పాటు నిలబడి పోయాను. కొంచెం దూరంలో లక్ష్మయ్య చిన్న కొడుకు అంత విషాదంలోనూ నా కోసం నిలబడి పోయాడు. వర్షం పడడం వల్ల చెప్పులతో నడవలేక తీసి చేత్తో పట్టుకుని ముందుకు కదిలి లక్ష్మయ్య కొడుకును కలిశాను. సరిగ్గా నాలుగు రోజులకు, ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు రిజర్వాయర్ నిండింది. లక్ష్మయ్యతో గడిపిన పరిసరాలన్నీ రిజర్వాయర్‌లో నిండి పోయాయి. కానీ మట్టి మనిషి లక్ష్మయ్య మాత్రం నాలో నిండి పోయాడు.



ఉత్కంఠభరితపు యండమూరి తాజా సీరియల్
ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక
పాఠకుల కోసం ఎదురుచూస్తోంది...